# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :288 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 30-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## కుప్పకూలి.. పేలిన ఎఫ్-35 యుద్ధ విమానం..

న్యూయార్క్: అమెరికాకు చెందిన ఎఫ్-35 యుద్ధ విమానం కుప్పకూలింది. ఈ ఘటన అలస్కాలోని ఎలిసన్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో జరిగింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ ఘటన జరిగింది. ఆకాశంలో విన్యాసం చేస్తున్న సమయంలో.. ఒక్కసారిగా ఎఫ్-35 కిందకు జారింది. విమానాశ్రయ రన్‌వేపై పడి పేలిపోయింది. ఆ సమయంలో భారీగా మంటలు వ్యాపించాయి.

ఈ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. రన్‌వేపై కూలడంతో జెట్ పూర్తిగా ధ్వంసమైంది.

%ఆ యుద్ధ విమానంలో ఉన్న పైలెట్ ప్రస్తుతం క్షేమంగా ఉన్నాడు. అతన్ని బాసెట్ ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. ఎయిర్‌బేస్ పరిధిలోనే దుర్ఘటన చోటుచేసుకున్నది. ఎమర్జెన్సీ, అంబులెన్స్ సర్వీసులు వేగంగా స్పందించాయి. ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు.

## ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల.. ఫిబ్రవరి 27న పోలింగ్




అమరావతి : ఏపీలో మరో రెండు నెలల్లో ఖాళీ కానున్న రెండు పట్టభద్రులు , ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని భర్తీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉభయగోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా నియోజకవర్గాల్లో రెండు పట్టభద్రుల స్థానాలకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలోని ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది .ప్రస్తుతం ఏపీలోని పట్టభద్రుల స్థానాలకు ఐలా వెంకటేశ్వరరావు, కెఎస్ లక్ష్మణారావు, టీచర్ ఎమ్మెల్సీగా పాకాలపాటి రఘువర్మ కొనసాగుతున్నారు. ఈ ముగ్గురి పదవికాలం మార్చి 29తో ముగుస్తుంది. ఈ స్థానాలను , భర్తీ చేసేందుకు గాను ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది.ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ, 10వ తేదీన నామినేషన్లకు ఆఖరు గడువు, 11న పరిశీలన , 13న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ , మార్చి 3న కౌంటింగ్, ఫలితాల వెల్లడి ఉంటుందని స్పష్టం చేసింది.

## పొగమంచు కారణంగా 50 వాహనాలు ఢీ.. పలువురికి గాయాలు



ఢిల్లీ - మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పొగమంచు కారణంగా దాదాపు 50 వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. %పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘజియాబాద్ సమీపంలోని ఢిల్లీ %-% మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే, ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే పై బుధవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ముందుగా ఢిల్లీ మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేలోని మీరట్ %-% ఘజియాబాద్ క్యారేజ్‌వేలో హవా హవాయ్ రెస్టారెంట్‌కు 2 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగింది. పొగమంచు కారణంగా దాదాపు 30 నుంచి 35 వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి.ఆ తర్వాత బాగ్‌పట్ %-% దుహై క్యారేజ్‌వేపై (20 నుంచి 25 కార్లు ఢీ కొన్నాయి. రెండు ప్రమాదాలూ దట్టమైన పొగమంచు కారణంగానే జరిగినట్లు పోలీసులు తెలిపారు. విజిబిలిటీ సరిగా లేకపోవడంతోనే ప్రమాదాలు సంభవించినట్లు చెప్పారు. ఈ రెండు ఘటనల్లో ఐదుగురికి గాయాలైనట్లు చెప్పారు. గాయపడిన ఐదుగురిని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. వారు ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పోలీసులు వెల్లడించారు.

## భవిష్యత్‌లో త్రిష మరింత రాణించాలి



హైదరాబాద్ : మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్ టోర్నీలో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ప్రపంచ స్థాయిలో త్రిష సత్తా చాటడం మనందరికీ గర్వకారణం. భవిష్యత్తులో త్రిష మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు.

గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. త్రిషతో పాటు మరో ఓపెనర్ కమిలిని (42 బంతుల్లో 51, 9 ఫోర్లు) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే.

## కుంభమేళాలో 'మహా' విషాదాలు..!



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా పేరు గాంచిన మహా కుంభ మేళా లో అపశ్రుతి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. నేడు మౌనీ అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ప్రయాగ్‌రాజ్‌లోని గంగ, యమున, సరస్వతి నదులు కలిసే త్రివేణీ సంగమం వద్ద అమృత స్నానాలకు భక్తులకు ఎగబడ్డారు. భక్తుల తాకిడి కారణంగా అక్కడే ఉన్న బారికేడ్లు విరగడంతో తొక్కిసలాట జరిగింది.

సంగమం వద్ద జరిగిన ఈ తొక్కిసలాటలో 20 మంది మృతిచెందినట్లు జాతీయ మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. కానీ అధికారులు మాత్రం మరణాలను ధ్రువీకరించలేదు. సుమారు 50 మందికిపైగా భక్తులు గాయపడినట్లు తెలుస్తోంది. కాగా, ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా పేరు గాంచిన కుంభమేళాలో గతంలో కూడా అనేక తొక్కిసలాట ఘటనలు జరిగాయి. ఆయా ఘటనల్లో అనేక మంది భక్తులు మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. కుంభమేళాల సందర్భంగా గతంలో జరిగిన 'మహా' విషాదాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

'మహా' విషాదాలు..!

1954.. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన మొట్టమొదటి కుంభమేళా. ఆ కుంభమేళా చరిత్రలో నిలిచిపోయే విషాదాంతమైంది. 1954 ఫిబ్రవరి 3 అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్)లో జరిగిన కుంభమేళాకు మౌనీ అమావాస్య సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో దాదాపు 800 మందికిపైగా మరణించి ఉంటారని అంచనా.

ఆ తర్వాత 1986లో హరిద్వార్‌లో జరిగిన కుంభమేళా కూడా విషాదాంతమైంది. అప్పటి యూపీ సీఎం వీర్ బహదూర్ సింగ్.. వివిధ రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, పార్లమెంట్ సభ్యులతో కలిసి హరిద్వార్‌కు వచ్చారు. దీంతో భద్రతా సిబ్బంది సాధారణ ప్రజలను నదీతీరాల్లోకి రానీకుండా ఆంక్షలు విధించారు. దీంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. భక్తులు ఒక్కసారిగా సిబ్బందిని దాటుకుంటూ నదీ తీరంవైపు చొచ్చుకురావడంతో తొక్కిసలాటకు దారి తీసింది. ఈ దుర్ఘటనలో 200 మంది ప్రాణాలు కోల్పోయారు.

2003లో కూడా ఇదే సీన్ రిపీటైంది. మహారాష్ట్రలోని నాసిక్‌లో కుంభమేళా సందర్భంగా పుణ్యస్నానాల కోసం వేలాది మంది యాత్రికులు గోదావరి నది వద్ద గుమి గూడారు. ఆ సమయంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో మహిళలు సహా కనీసం 39 మంది మరణించారు. దాదాపు 100 మందికిపైగా గాయపడ్డారు.

అదేవిధంగా.. 2013 ఫిబ్రవరి 10న కుంభమేళా సందర్భంగా అలహాబాద్ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట జరిగింది. అక్కడ ఉన్న పాదచారుల వంతెన ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో భయాందోళనకు గురైన యాత్రికులు పరుగులుతీయడంతో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 42 మంది ప్రాణాలు కోల్పోగా, 45 మంది గాయపడ్డారు.

## ప్రయాగ్‌రాజ్ ఘటన చాలా బాధాకరమైంది: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట గురించి ప్రధాని మోదీ స్పందించారు. ఆ ఘటన తీవ్ర బాధను మిగిల్చిందన్నారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు స్థానిక ప్రభుత్వం అన్ని రకాల సాయం చేస్తోందన్నారు. యూపీ ప్రభుత్వంతో తాను నిత్యం టచ్‌లో ఉన్నట్లు ప్రధాని వెల్లడించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. త్రివేణి సంగమం వద్ద ఇవాళ తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాటలో సుమారు 14 మంది మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. 50 మందికిపైగా గాయపడ్డారు. గాయపడ్డ వారికి స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు.

## దేశానికి గర్వకారణమైన రోజు..



హైదరాబాద్ : ఇస్రో వందో ప్రయోగం విజయవంతంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో వందో రాకెట్ ప్రయోగం భారతదేశానికి ఒక గొప్ప విజయమని ప్రశంసించారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్.. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎన్వీఎస్-02 ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ అని.. దీంతో మన సైంటిస్టుల ప్రతిభ అని పేర్కొన్నారు. దేశానికి గర్వకారణమైన రోజు ఇవాళ అని హరీశ్‌రావు ప్రశంసించారు. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు(నావిగేషన్, ముఖ్యంగా నౌకాయానం) అందిస్తుంది. 50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లిన 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను యూఆర్ శాటిలైట్ కేంద్రంలో రూపొందించి అభివృద్ధి పరిచారు. ఇందులో రేజింగ్ పేలోడ్‌కు అదనంగా ఎల్1, ఎల్5 నావిగేషన్ పేలోడ్లు ఉన్నాయి. ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు, ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలిపింది.

## భక్తులతో కిక్కిరిసిన ప్రయాగ్‌రాజ్..



ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా పేరు గాంచిన మహా కుంభ మేళా ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో ఘనంగా కొనసాగుతోంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 13వ తేదీన ప్రారంభమైన ఈ కుంభమేళా 45 రోజుల పాటు కొనసాగనుంది. 144 ఏండ్ల తర్వాత వచ్చిన ఈ కుంభమేళా సందర్భంగా గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమం లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఇక కుంభమేళాలో ఇవాళ ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇవాళ మౌనీ అమావాస్య. మహా కుంభమేళాలో అమావాస్య రోజున నిర్వహించే స్నానాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. దీంతో ఇవాళ భక్తులు రోజూ కంటే అధిక సంఖ్యలో త్రివేణీ సంగమానికి పోటెత్తారు. ఉదయం నుంచే సంగమంలో నదీ స్నానాలు ఆచరిస్తున్నారు. ఉదయం 6 గంటల వరకు ఏకంగా 1.75 కోట్ల మంది ప్రజలు పవిత్ర స్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం తెలిపింది. ఇక మహాకుంభ మేళా ప్రారంభమైన జనవరి 13వ తేదీ నుంచి జనవరి 28వ తేదీ వరకూ మొత్తం 19.94 కోట్ల మంది ప్రజలు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు వెల్లడించింది.మౌనీ అమావాస్య సందర్భంగా ఇవాళ ఒక్కరోజే ఏకంగా 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాల కోసం తరలివస్తారని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్లు అన్ని ఏర్పాట్లూ చేసింది. ఇందులో భాగంగా ప్రయాగ్‌రాజ్‌ను నో వెహికిల్ జోన్‌గా ప్రకటించింది. సంగంకు వెళ్లే స్థానికులు ఫోర్ వీలర్లను కాకుండా, టూ వీలర్లను వాడాలని సూచించింది. మరోవైపు కుంభమేళా ప్రాంతాన్ని ఏఐ ఆధారిత సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.అమృత స్నాన దినాల్లో.. మౌనీ అమావాస్య స్నానమే ప్రత్యేకమైందిగా భావిస్తారు. ఈ రోజున పవిత్ర నదీ జలం అమృతంలా మారుతుందని చెబుతుంటారు. మౌనీ అమావాస్యను సాధువులు స్నానం చేసే రోజు అని కూడా పేర్కొంటారు. సాంప్రదాయకర రీతిలో మౌనంగా మౌనీ అమావాస్య రోజున స్నానాన్ని ఆచరిస్తారు. మౌనీ అమావాస్యను పురస్కరించుకొని జనవరి 28, 29, 30 తేదీల్లో ప్రయాగ్‌రాజ్‌లో స్కూళ్లకు అధికారులు సెలవు ప్రకటించారు.

## ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని గ్రామస్తుల ధర్నా.

జోగులాంబ గద్వాల : ఇథనాల్ ఫ్యాక్టరీగా వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద దన్వాడ గ్రామంలో జీఆర్ఎఫ్ ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఏడవ రోజుకు చేరుకున్నాయి. బుధవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి( %ఎవఅన్ఫ్‌తీఖఎఱ =వ౧౧ఎ%), ఎమ్మెల్యే విజయుడువారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కంపెనీ రద్దు అయ్యేంతవరకు మీతో పాటు కృషి చేస్తామన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. %కాగా, వీరి దీక్షకు చుట్టుపక్కల ఉన్న 11గ్రామాలకు చెందిన రైతులు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మండలంలోని వివిధ గ్రామాల్లోని పంట భూములు నాశనమవుతాయని ఆవేదన వ్య క్తం చేశారు. అంతేకాకుండా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాల ద్వారా తుంగభద్ర నదితోపా టు పరిసర గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభు త్వం వెంటనే ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## మరో 2,800 కోట్ల రుణం...ఆర్‌బీఐ నుంచి కొత్త అప్పు

**వేలంలో పాల్గొని పొందిన కాంగ్రెస్ సర్కారు**

**అదనపు అప్పులకు కేంద్రం ప్రభుత్వం ససేమిరా**

**నెలకు రూ.10 వేల కోట్లకు ఆర్బీఐకి ఇండెంట్**

**జనవరి నెలలో పొందింది రూ.5,800 కోట్లే**

హైదరాబాద్, : రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి మంగళవారం మరో రూ.2,800 కోట్ల రుణాన్ని సమీకరించింది. రూ.1000 కోట్ల విలువైన రెండు బాండ్లను 22 సంవత్సరాలు, 24 సంవత్సరాలు, 800 కోట్ల విలువైన బాండును 25 ఏండ్ల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ ఆర్బీఐకి జారీచేసింది. మంగళవారం జరిగిన వేలంలో పాల్గొని 2,800 కోట్ల రుణం పొందింది. 7న ఆర్బీఐ నిర్వహించిన వే లంలో పాల్గొని రూ.3000 కోట్ల రుణాన్ని సేకరించింది. 14, 21న నిర్వహించిన వేలంలో పాల్గొనలేదు. చివరి మంగళవారం నాడు పాల్గొని మూడు బాండ్ల ద్వారా 2,800 కోట్లు సమీకరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని కేంద్రం 49,255 కోట్లకు విధించగా, ఇప్పటికే రేవంత్‌ప్రభు త్వం మూడు త్రైమాసికాల్లో తీసుకున్న రుణం రూ.41,759 కోట్లకు చేరింది.కేంద్రం అనుమతించిన అప్పులో ఇంకా రూ.7,500 కోట్ల వరకు రుణాలు చివరి త్రైమాసికంలో తీసుకొనే అవకాశం ఉన్నది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చివరి త్రైమాసికంలో ఏకంగా రూ.30 వేల కోట్ల అప్పు (నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున) తీసుకుంటామని ఆర్బీఐకి ఇండెంట్లు పెట్టింది. 7న రూ.3000 కోట్లు, 14న రూ.2000 కోట్లు, 21న రూ.2500 కోట్లు, 28న మరో రూ.2500 కోట్లకు ఇండెంట్లు ఇచ్చింది.వీటి కోసం కేంద్రం నుంచిగానీ, ఆర్బీఐ నుంచిగానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. దీంతో అదనపు అప్పు ఇవ్వబోమని కేంద్రం తేల్చి చెప్పినట్టు తెలుస్తున్నది. అందుకే ఈ నెల 14, 21న వేలం లో పాల్గొనటానికి అవకాశం లభించలేదు. ఈ నెలలో రెండు దఫాలుగా (7, 28 తేదీల్లో) రూ.5,800 కోట్ల అప్పును మాత్రం రాష్ట్రం తీసుకోగలిగింది. ఫిబ్రవ రి, మార్చిలో కూడా 10 వేల కోట్ల చొప్పు న ఆర్బీఐకి ఇండెంట్లు పెట్టింది. ఎంతమేరకు రుణం పొందేందుకు అవకాశం లభిస్తుందో చూడాల్సి ఉన్నది.



## గచ్చిబౌలిలో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి.. 9 మంది అరెస్ట్



హైదరాబాద్ : గచ్చిబౌలిలో వ్యభిచార గృహంపైమాదాపూర్ ఎస్ఓటీ, హెచ్‌టీఎఫ్ పోలీసులుదాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..గౌలిదొడ్డి టీఎన్‌జీవోస్ కాలనీలో ఓ యువకుడు కెన్యా, టాంజానియా, బ్యాంకాక్ విదేశీ అమ్మాయిలతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం అదుకున్న ఎస్ఓటీ, హెచ్‌టీఎఫ్ పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి 9 మంది ఫారిన్ అమ్మాయిలను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నిందితుడు ఒకరేనా లేదా ముఠాగా ఏర్పడి ఈ దందా కొనసాగిస్తున్నారా అనే కోణంలో సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## సంపాదకీయం

**గురువారం 30-01-2025**

# అవార్డుల రాజకీయం !

గద్దర్ చుట్టూ కొత్త రాజకీయం మొదలయ్యింది. గద్దర్ నక్సలైట్ కనుక ఆయనక పద్మ అవార్డు ఎలా ఇస్తామన్నకేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలతో ఇప్పుడు సర్వత్రా చర్చలు..ఉప చర్చలు..విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి. తాజాగా తెలంగాణ నుంచి ప్రముఖులు ఎవరికీ పద్మ అవార్డులు రాకపోవడం, దీనిపై సిఎం రేవంత్రెడ్డి తీవ్రంగా స్పందించడం..తిరిగి బండి సంజయ్ విమర్శలు చేయడం తో కథ మొదలయ్యింది. నిజానికిపద్మ అవార్డులే కాదు..ప్రతి ఒక్క విషయంపైనా ప్రజల్లో చర్చ జరగాలి. అనుయాయులకు నామినేటెడ్ రాజ్యసభ సభ్యత్వాలు, పద్మ అవార్డులు, భారతరత్నలు కూడా ఇచ్చేస్తున్నారు. అవార్డుకు ఎంపికైన వ్యక్తి అర్హుడా కాదా అన్నది చూడడం లేదు. గతంలో సచిన్ టెండుల్కర్కు భారతరత్న ఇచ్చారు. ఆయన దేశానికి ఏ రకంగా ఉపయోగ పడ్డాడో తెలియదు. తన సొంత కెరీర్, రికార్డుల కోసం మాత్రమే అతను క్రికెట్ ఆడాడు. సామాజికంగా బాధ్యతగా పెద్ద సేవలేవీ చేయలేదు. కానీ దేశానికి సేవ చేయడమే గాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో మూలస్తంభంగా నిలిచిన రతన్ టాటాకు మాత్రం మనం భారతరత్న ఇవ్వలేదు. ఆయన బతికి ఉన్నప్పుడే ఇచ్చివుంటే గౌరవించుకుని ఉన్నట్లుగా ఉండేది. పివి నరసింహారావుకు భారత రత్న ఇవ్వడంలో కాంగ్రెస్ చేసిన రాజకీయం అంతా ఇంతాకాదు. దేశాన్ని నిలబెట్టిన పివిని అవమానించిన కాంగ్రెస్, చివరకు భారతరత్న ఇవ్వకుండా మరింతగా అవమానిం చింది. అలాంటి కాంగ్రెస్ ఇప్పుడు రాజ్యాంగం పేరిట రాజకీయాలు చేస్తోంది. ఇక బిజెపి కూడా సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ను రాజ్యసభకు పంపింది. అలాగే కాంగ్రెస్ తెలంగాణ నుంచి అభిషేక్ మనుసింఘ్వీని రాజ్యసభకు పంపింది. తెలంగాణ కోసం కొట్లాడిన ఎందరినో కాదని ఓ లాయర్కు అవకాశం ఇచ్చింది. ఎవరు అధికారంలో ఉన్నా నిజాయితీ లేకుండా పోయింది. అందుకు బిజెపి మినహాయింపు కాదని చెప్పాల్సిందే. ఇవన్నీ ఇలావుంటే తాజాగా పద్మ అవార్డుల పంచాయితీ వచ్చింది. తెలంగాణలో పద్మ అవార్డుల పంచాయితీ రచ్చ చేసింది. ఈ వ్యవహారంపై ఇటు కాంగ్రెస్..అటు బీజేపీ నేతలు తగ్గేదే లేదంటూ కౌంటర్లు విసురుతున్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వానిది..ముమ్మాటికి వివక్షే అని కాంగ్రెస్ పార్టీ మండిపడుతోంది. అటు బీజేపీ మాత్రం..జాబితా పంపించినంత మాత్రాన అనర్హులకు అవార్డులు ఇవ్వాలా అంటూ ప్రశ్నిస్తోంది..? ఇలా.. రిపబ్లిక్డే ముగిసినా.. తెలంగాణలో పద్మ అవార్డులపై రాజకీయ రచ్చమాత్రం చల్లారడం లేదు. ఈ వ్యవహారంపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్కు ఐదు అవార్డులు వచ్చినప్పుడు తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులు కూడా ఇవ్వక పోవడం వివక్ష కాదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ప్రభుత్వ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లు.. పద్మ అవార్డుల కోసం పంపించారు. వీరి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కానీ వీరిలో ఏ ఒక్కరి పేరును కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు.. ఈ విషయంలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రానికి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. అయితే ఇందులో కనీసం చుక్కారామయ్య పేరును కూడా పరిశీలించకపోవడం, కవి అందెశ్రీ పేరును కూడా పరిశీలించకపోవడం దారుణంగానే చూడాలి. గద్దర విషయంలో కూడా బిజెపి అతిగా మాట్లాడడం మానితే మంచిది. గద్దరు ప్రజాకవి. నక్సలైట్ ఉద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అలా వచ్చిన వారిలో ప్రస్తుత మంత్రి సీతక్క కూడా ఉన్నారు. వారిని తక్కువ చేసి చూడడం, మాట్లాడడం మంచిది కాదు. పద్మ అవార్డుల విషయంలో జరిగిన వివక్ష క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. అయితే నక్సల్స్ భావజాలంతో ఎందరో బీజేపీ నేతలను చంపించిన గద్దర్లాంటి వ్యక్తులకు..పద్మ అవార్డులు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అలాంటి వ్యక్తులకు బరాబర్ అవార్డులు ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్న బండి.. అర్హులైన వారికే పద్మ అవార్డులు వస్తాయని తేల్చిచెప్పారు. గద్దర్పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మాజీ నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ లాంటి వ్యక్తిని పద్మ అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా అని ప్రశ్నించారు. బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డులు ఇస్తారా?అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ ప్రశ్నించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గద్దర్ పోరాటం చేశారన్న చామల.. గద్దర్పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అన్నారు. గద్దర్పై బండి సంజయ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఖండించారు... బుద్దిస్ట్ మీకు మావోయిస్టుగానే కనబడ్డారా? అని ప్రశ్నించారు. గద్దర్లోని తెలంగాణ ఉద్యమకారుడు, దళిత ప్రజా ఉద్యమకారుడు కనిపించలేదా? అని నిలదీశారు. గద్దర్పై బండి సంజయ్ వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ విధానమా? చెప్పాలని డిమాండ్ చేశారు అద్దంకి. అయితే.. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. భావజాలం వేరు మావోయిస్టుగా చేయడం వేరన్న బండి.. మావోయిస్టులతో ఈటలకు సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామంటున్న గద్దర్ అవార్డులను బీజేపీ వాళ్లు తీసుకోరని స్పష్టం చేశారు. అటు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా పద్మ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరంజీవికి ఇస్తే, ఇప్పుడు బీజేపీ బాలకృష్ణకి ఇచ్చిందని విమర్శించారు. గద్దర్కు, ఎల్టీటీఈకి పెద్దతేడా లేదంటూ మరో బీజేపీ నేత విష్ణువర్ధన్రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఇప్పటికే మండిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా యూజీసీ, పద్మ అవార్డుల అంశంలోనూ మోదీ సర్కారు తీరును తప్పుబడుతోంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అయితే అవార్డుల ఎంపిక ఖచ్చితంగ ఆపారదర్శకంగానే సాగాలి. అర్హులకే అవార్డులు కానీ, రాజ్యసభ సభ్యత్వాలు కానీ దక్కాలి. బిజెపి ఈ విసయంలో పారదర్శకంగా పనిచేస్తే మంచిది

# స్వాతంత్ర సమరయోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కేవి కేశవులు




తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్వతంత్ర సమరయోధులు కర్నె వెంకట కేశవులు. ఈయన రాజకీయ నాయకుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో

## –నేడు ఆయన వర్ధంతి

జౌలి శాఖ సహకార మంత్రిగా పని చేశాడు.కె.వి.కేశవులు 1924 జనవరి 14న తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా ధర్మపురిలో జన్మించాడు. ఆయన విద్యామస్యమంతా ధర్మపురిలో పూర్తి చేశాడు. కె.వి.కేశవులు భారత స్వతంత్ర ఉద్యమంలో కీలకంగా పని చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర సమరయోధుల సంఘం వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్ (నైజాం) సంస్థానం భారతదేశంలో కలవలేదు. ఆయన నిజాం నిరంకుశపాలన గురించి ప్రజలను చైతన్య వంతులను చేయడం, వారి అరాచకాలను మొండిగా ఎదిరించి జాతీయ పతాకాన్ని రెప రెప లాడించి, నాటకాలు, సాహిత్యాలతో ప్రజలను కార్మోకులను చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

హైదరాబాద్ రాష్ట్రం భారతదేశం ప్రభుత్వ పాలనలో విలీనమైన తరువాత ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరాడు.కె.వి.కేశవులు 1972, 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జౌలి శాఖ సహకార మంత్రిగా పని చేశాడు. 30 జనవరి 2019లో వృద్ధాప్య కారణాలతో హైదరాబాద్ లో మృతి చెందారు.

# కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందెలా కార్పోరేటర్ల కృషి

### - రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్





, గోదావరిఖని:తొలి కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందెలా కార్పోరేటర్ల కృషి చేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే చందర్ నివాసంలో బి.ఆర్.ఎస్ తాజా మాజీ కార్పోరేటర్లకు అభినందన సత్కారాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టారు. శాలువాలు మెమేంటోలతో సత్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రామగుండం కార్పోరేషన్ లో 5 సంవత్సరాల పాటు డివిజన్లో ప్రజలకు మౌళిక సదుపాయాలు అందించడంలో ప్రజాప్రతినిధులు ఎంతగానో పనిచేశారన్నారు. తోలి సిఎం కేసీఆర్ బంగారు తెలంగాణ భాగస్వామ్యం కావడం, మాజీ మంత్రి వర్యులు కేటీఆర్ పట్టణ ప్రగతిలో డివిజన్ అభివృద్ధి చేపట్టడం జరిగుందన్నారు. ప్రతి ఇంటికి నల్ల కనెక్షన్ రోడ్ల నిర్మాణం అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందరన్నారు. రాబోవు కాలంలో మరింత ఉజ్వలమైన భవిష్యత్తు ఎన్నికల్లో ప్రజలు తిరిగి అవకాశం కల్పించాలన్నారు.

పెంట రాజేష్ పాముకుంట్ల భాస్కర్ బోడ్డు రజిత రవీందర్ జంజర్ల మౌనిక జె.వి.రాజు రాకం లత దామ్మెదర్ రమణ రెడ్డి కల్వచర్ల కృష్ణ వేణి భూమయ్య కన్నూరి సతీశ్ కుమార్ శ్రీనివాస్ బాదె అంజలి గాదం విజయ నందు కో ఆప్షన్ సభ్యులు రఫీక్ వంగ శ్రీనివాస్ గౌడ్ తస్లీమభాను జహిద్ పాషా మాజీ ఎంపిటి లు కొలిపాక శరణ్య మధుకర్ రెడ్డి శ్రీవాణీ కిరణ్ హతీక్ నాయకులు నారాయణదాసు మారుతి చల్లా రవీందర్ రెడ్డి అచ్చే వేణు సట్టు శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్ తదితరులు పాల్గొన్నారు

# సకల సౌకర్యాలు కల్పించాం

### బాగా చదువుకోవాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి, ప్రజాక్రాంతి, జనవరి 29: అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం బాగా చదవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థులకు సూచించారు. బుధవారం గణపురం కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుందని విద్యార్థులు బాగా చదివి మంచి గ్రేడ్ లో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. వంటగదిని పరిశీలించారు. వంట సామాగ్రిని విద్యార్థుల కోసం వండిన పదార్థాలను పరిశీలించారు. పాఠశాలలో నిలువచేసిన వంట సామాగ్రిని తనిఖీ చేసి సరిపడా వస్తువులు ఉన్నాయా లేదా వంట కోసం ఉపయోగపడే సామాగ్రి అవసరం ఉందా అని ఎస్ఓ లావణ్యను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చలికాలంలో అన్ని సంక్షేమ వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన గీజర్ లు పనిచేస్తున్నాయా లేదా దుప్పట్లు సరిపడా ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో మరుగుదొడ్లు, స్నానాల గదులు పాతబడిపోవడం వల్ల విద్యార్థినిలకు ఇబ్బంది ఎదురవుతుందని అదేవిధంగా లో వోల్టేజీ సమస్య ఉందని, మిషన్ భగీరథ నీరు రావడంలేదని ఎస్ఓ లావణ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పాఠశాలలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తమకు దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా అంచనాలు తయారు చేపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి పడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. పాఠశాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని డిఈఓను ఆదేశించారు. అనంతరం కుందూరుపల్లి ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రాజేందర్, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, గిర్దావర్ దేవేందర్, పంచాయతీ కార్యదర్శి విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పనులుంటే చక్కబెట్టుకోండి..!

# ఫిబ్రవరిలో సగం రోజులు బ్యాంకులు బంద్..!

**హైదరాబాద్,:** కొత్త సంవత్సరమైన 2025లో మరో నెల కొద్దిరోజుల్లోనే ముగిసిపోనున్నది. ఫిబ్రవరి మాసం మొదలు కానున్నది. ఫిబ్రవరిలో దాదాపు 14 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. ప్రతినెలా బ్యాంకులకు సెలవులు ఉండే విషయం తెలిసిందే. ఈ మేరకు బ్యాంకుల సెలవులకు సంబంధించిన జాబితాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ప్రస్తుతం ఎక్కువగా బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నారు. అయితే, ఏవైనా ఆర్థిక సంబంధిత పనుల కోసం తప్పనిసరిగా బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఈ క్రమంలో బ్యాంకులకు వెళ్లే ముందు ఏయే రోజుల్లో బ్యాంకులు పని చేస్తాయి ? ఎప్పుడు సెలవులుంటాయో తెలుసుకోవడం ముఖ్యం. లేకపోతే ఇబ్బందులుపడే అవకాశం ఉంటుంది. సాధారణ సెలవులతో పాటు పండుగ సెలవులు కలుపుకొని ఫిబ్రవరిలో బ్యాంకులకు 14 రోజులు సెలవులు ఉంటాయి.బ్యాంకులు మూసి ఉన్నా మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు 24గంటలు పని చేస్తూనే ఉంటాయి.

వీటితో డబ్బులు పంపేందుకు అవకాశం ఉంటుంది. ఇక నగదును తీసుకునేందుకు ఏటీఎంలు సైతం అందుబాటులో ఉంటాయి. పలు బ్యాంకులు క్యాష్ డిపాజిట్ మిషన్లను సైతం అందుబాటులోకి తీసుకువచ్చాయి. దాంతో డబ్బులను ఖాతాల్లో జమ చేసుకునేందుకు వీలుంది. పలు సేవల కోసం బ్యాంకులకు వెళ్లే అవసరం ఉంటుంది. ఆ సమయంలో బ్యాంకులకు సంబంధించిన సెలవుల సమాచారం ఉంటే.. ముందస్తుగానే పనులన్నీ చక్కబెట్టుకునేందుకు ఛాన్స్ ఉంటుంది. ఫిబ్రవరిలో బ్యాంకుల సెలవులు ఇవే..: ఫిబ్రవరి 2 : ఆదివారం కావడంతో దేశవ్యాప్తంగా బ్యాంకుల మూసివేత. ఫిబ్రవరి 3 : సరస్వతి పూజ




సందర్భంగా అగర్తలలో బ్యాంకులకు హాలీడే. ఫిబ్రవరి 8 : రెండో శనివారం సందర్భంగా సెలవు. ఫిబ్రవరి 9 : ఆదివారం సందర్భంగా హాలీడే. ఫిబ్రవరి 11 : థై పోసమ్ సందర్భంగా చెన్నైలో మూసివేత. ఫిబ్రవరి 12 : శ్రీరవిదాస్? జయంతి నేపథ్యంలో షిమ్లాలో సెలవు. ఫిబ్రవరి 15 : లుయ్ గై ని పండుగ సందర్భంగా ఇంఫాల్లో హాలీడే. ఫిబ్రవరి 16 : ఆదివారం కావడంతో దేశవ్యాప్తంగా బ్యాంకుల బంద్. ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ముంబయి, నాగ్పూర్లో సెలవు. ఫిబ్రవరి 20 : స్టేట్హుడ్ డే సందర్భంగా అరుణాచల్ప్రదేశ్ ఈటానగర్లో బ్యాంకులకు సెలవు. ఫిబ్రవరి 22 : నాలుగో శనివారం కావడంతో బ్యాంక్లకు సెలవు. ఫిబ్రవరి 23 : ఆదివారం బ్యాంకుల మూసివేత. ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి సందర్భంగా ఏపీ, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో సెలవులు. ఫిబ్రవరి 28 : లోసర్ సందర్భంగా గ్యాంగ్టక్లోని బ్యాంక్లకు సెలకు హాలీడే.

# అమెరికాలో ఇన్కమ్ ట్యాక్స్ ఎత్తివేత

### కొత్త ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్న ట్రంప్ దిగుమతి సుంకాలతో భర్తీ చేసుకునేలా ప్లాన్

వాషింగ్టన్,జనవరి : అమెరికా పౌరులకు ఆదాయపు పన్ను నుంచి విముక్తి కల్పించేలా సోమవారం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనలు చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఖర్చు చేసి ఆర్థిక వ్యవస్థలోకి నిధుల ప్రవాహాన్ని పెంచేందుకే ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలను ధనవంతులు చేసే వ్యవస్థ పునరుద్ధరణ దిశగా ఈ చర్య ఉపయోగపడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దుబాయ్లో పన్ను రహిత విధానం ఉంది. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో ఇన్కమ్ ట్యాక్స్ నుంచి వచ్చే మొత్తం చెప్పుకోదగ్గ స్థాయిలోఉంది. ట్రంప్ నిర్ణయంతో ఆ మేరకు కోతపడితే.. దానిని భర్తీ చేసుకొనేందుకు దిగుమతి సుంకాలను వాడుకోవాలన్నది ప్రణాళికగా చెబుతున్నారు. 'అమెరికన్లను ధనవంతులు, మరింత శక్తిమంతులుగా చేసే వ్యవస్థలోకి మనం వెళుతున్నాం. ఇతర దేశాలను సుసంపన్నం చేసేందుకు మన వారిపై పన్నులు వేసే బదులు.. మనమే విదేశాలపై పన్నులు విధించి అమెరికన్లను సంపన్నులు చేయాలి. వీటిని వసూలు చేసేందుకు ఎక్స్టర్నల్ రెవెన్యూ సర్వీసును ప్రారంభించాను' అని రిపబ్లికన్ సభ్యుల సమావేశంలో వ్యాఖ్యానించారు. అమెరికా చరిత్రలోనే 1870 నుంచి 1913 మధ్య ప్రజలు అత్యధిక సంపదతో తులతూగారని ట్రంప్ పేర్కొన్నారు. నాడు సుంకాల ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉండేదని చెప్పారు. అప్పట్లో దిగుమతి సుంకాల నుంచి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభించేదన్నారు. అమెరికా తక్షణమే తన వాణిజ్య వ్యవస్థను మార్చుకోవాలన్నారు. అమెరికా ఉద్యోగులు, కుటుంబాలను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారత్, చైనా, బ్రెజిల్పై అత్యధిక పన్నులు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. 'బయట దేశాలు ఏం చేస్తున్నాయో చూడండి. చైనా భారీగా పన్నులు వసూలు చేస్తుంది. ఇక భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు కూడా ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. మనం అలా జరగనీయకూడదు. అమెరికా ప్రయోజనాలు అన్నింటికంటే ముందుండాలి' అని పేర్కొన్నారు. వాస్తవానికి ట్రంప్ గత డిసెంబర్లోనే బ్రిక్స్ దేశాలు ప్రత్యేక కరెన్సీ తీసుకొస్తే 100శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. డాలర్ వినియోగం నిలిపేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం

రాజన్న సిరిసిల్ల,జనవరి29: ప్రజా గాయకుడు గద్దర్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండపల్లిలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తన ఆట, పాటలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గద్దర్పై సంజయ్ నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాగా, 'నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే.. నక్సలైట్లతో కలిసి ఎంతో మందిని గద్దర్ హత్య చేయించారు. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎందుకు ఇవ్వాలి' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

# రాజ్యాంగాన్ని విశ్వసించని వారికి పద్మ అవార్డు ఎలా ఇస్తారు..?

### నక్సలైట్లతో ఎంతోమందని పోలీసులను బలితీసున్నాడు : ఏపీ బీజేపీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్

అమరావతి,జనవరి29:గద్దర్కు పద్మ అవార్డు ఇవ్వాలన్న అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రెండు మూడు రోజులుగా వాగ్వాదం జరుగుతుంది. నక్సల్ భావజాలం ఉన్న వ్యక్తికి అవార్డులు ఎలా ఇస్తారని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నిస్తుంటే.. గద్దర్కు అవార్డు ఎందుకు ఇవ్వరని సీఎం రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను నిలదీస్తూనే ఉన్నారు. పద్మ అవార్డుల ఎంపికై తెలంగాణలో మొదలైన ఈ చిచ్చు ఇప్పుడు ఆంధ్రాకు కూడా పాకింది. గద్దర్కు పద్మ అవార్డు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడంపై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ మండిపడ్డారు. రాజ్యాంగాన్ని విశ్వసించని వ్యక్తికి పద్మ పురస్కారం ఎలా ఇస్తారని నిలదీశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే.. గద్దర్ మాత్రం నక్సలైట్లతో కలిసి ఎంతోమందిని హత్య చేయించారని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. గద్దర్ను ఎల్టీటీ ప్రభాకరన్, నయిమ్తో పోల్చారు. అనేక మంది పోలీసులను చంపిన కేసులో కోర్టులకు తిరగలేనని రాష్ట్రపతికి గద్దర్ లేఖ రాసుకున్నారని గుర్తుచేశారు. గద్దర్ కుమార్తె వెన్నెల ఇప్పుడు కాంగ్రెస్లో ఉన్నారు కాబట్టి గద్దర్కు పద్మ పురస్కారం ఇవ్వాలా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. రాజీవ్గాంధీని చంపిన వారికి కూడా పద్మ పురస్కారం ఇవ్వమంటారా అని ప్రశ్నించారు. గద్దర్కు ఎల్టీటీ తీవ్రవాదులకు తేడా లేదని వ్యాఖ్యానించారు. మాజీ మావోయిస్టు, రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వ్యక్తికి ఏ హోదాలో పద్మ అవార్డు ఇవ్వాలని అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. ఉగ్రవాదాలకు కూడా పద్మ అవార్డులు అడుగుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పద్మ అవార్డుల గురించి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. పద్మ అవార్డుల ఎంపిక ప్రక్రియ తెలియని వాళ్లు రేవంత్కు సలహాలు ఇస్తున్నట్లు ఉందని అన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యానికి మహిళ బలి

అమరావతి,జనవరి29:తెనాలిలో వైద్యుల నిర్లక్ష్యానికి ఓ మహిళ ప్రాణం కోల్పోయింది. కుటుంబ నియంత్రణ కోసం వచ్చిన ఆమెకు వైద్యులు ఆపరేషన్ చేశారు. అది వికటించడంతో గాజుల పావని(32) అనే మహిళ మృతి చెందింది. ఈ ఆపరేషన్ చేయడంలో వైద్యుల నిర్లక్షం స్పష్టంగా కనిపిస్తోంది. ఆపరేషన్ చేసే సమయంలో వైద్యులు చిన్న ప్రేగుకు, యూరినరీ బ్లాడర్కు గాయం చేశారు. దీంతో ఆమె శరీరం విషతుల్యమై షాక్లోకి వెళ్లింది. అప్రమత్తమైన వైద్యులు హుటాహుటిన గుంటూరు జీజీహెచ్కు తరలించారు. అక్కడ ఆమె మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శవాగారానికి తరలించారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే పావని చనిపోయిందని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# మొగిలిగిద్ద అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి

- జనవరి 31న సాయంత్రం నాలుగు గంటలకు పర్యటన ఖరారు
- సుమారు పదివేల మందితో మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవం
- కాంగ్రెస్ సర్కార్ లో విద్యా, వైద్యం, నిరుద్యోగ ఉపాధి పై దృష్టి

**అభివృద్ధి విషయంలో భేషజాలాలకు పోవద్దు**
**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**



షాద్ నగర్ : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎంతో ఘన చరిత్ర కలిగిన మొగలిగిద్ద గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.బుధవారం షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక మీడియా సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మొగలిగిద్ద గ్రామ పెద్దలు, నియోజకవర్గ ఆయా మండలాల పార్టీల అధ్యక్షులు, ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు.. ఈనెల 31న సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన ఖరారు అయిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సుమారు పదివేల మంది హాజరవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జనాలు పెద్ద ఎత్తున ఆసక్తిగా చూస్తారని అయితే 150 వార్షికోత్సవ పాఠశాలకు సంబంధించిన విద్యాభివృద్ధి కార్యక్రమం కాబట్టి పదివేల మందితో 16 ఎకరాల్లో పర్యటన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. సహజంగా ముఖ్యమంత్రి రాక సందర్భంగా గ్రామ అభివృద్ధి పై కొంత ఆసక్తి నెలకొని ఉంటుందని అయితే ముఖ్యమంత్రి గ్రామ అభివృద్ధి కోసం ఎలాంటి ప్రణాళిక చర్యలు తీసుకోవాలో ఆలోచించడం జరుగుతుందని, ప్రజల అంచనాలకు అనుగుణంగానే అభివృద్ధి ఉంటుందని శంకర్ స్పష్టం చేశారు. గ్రామ నివాసి ప్రొఫెసర్ హరగోపాల్ ఇంత వృద్ధాప్యంలో కూడా విద్య అభివృద్ధి కోసం పడుతున్న తాపత్రయం ఎంతో గొప్పదని అభివర్ణించారు. గత పదేళ్లలో మొగిలిగిద్దలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఒక చరిత్ర కలిగిన గ్రామం అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతో గ్రామ అభివృద్ధి గ్రామ చరిత్ర దశ దిశల వ్యాపిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

**మా పాలన "రబ్బర్ స్టాంపు" కాదు..:** గత పది ఏళ్లలో నియోజకవర్గంలో విద్య వైద్యం నిరుద్యోగుల ఉపాధి పూర్తిగా నిర్వీర్యమైందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్ర కలిగిన మొగిలిగిద్దలాంటి గ్రామాలు పాఠశాల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్ అడగగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి 150 వార్షికోత్సవానికి వస్తున్నట్లు సమ్మతం తెలియజేయడం అభినందనీయమని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాంత అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు ఎంతోమంది కృషి చేస్తున్నారని ఈ పాఠశాలలో చదువుకొని ఎంతో ప్రయోజకులైన వారు ఉన్నారని ముఖ్యమంత్రిగా బూరుగుల రామకృష్ణారావు, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి, ఇంకా విద్యుత్ శాఖ పోలీసు శాఖ రెవెన్యూ శాఖ విద్యాశాఖ ఇంకా అనేక ప్రైవేటు రంగాలలో కూడా ఎంతోమంది గొప్ప స్థితిలో ఉన్నవారు ఈ పాఠశాలలో చదువుకున్న వారు ఉన్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తమ ప్రభుత్వం విద్య వైద్యం నిరుద్యోగం ఉపాధి పట్ల చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. తన పాలన రబ్బర్ స్టాంపు మాదిరిగా కాదని ఎవరో చెబితే చేసేలా ఉండదని సొంత నిర్ణయాలతో ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గతంలో డిగ్రీ కళాశాల నిర్మాణం లోపాభిష్టంగా జరిగిందని, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కున్నారని ఇంజనీర్ల వ్యవస్థ సరిగా లేకపోవడం నిర్మాణ లోపం స్పష్టంగా కనిపిస్తుందని గుర్తు చేశారు. అదేవిధంగా జూనియర్ కళాశాల భవన దుస్థితి పై మీడియా కథనం తనను ఆకర్షించిందని వెంటనే తాను చదువుకున్న కళాశాలకు ఏదైనా చేయాలని లక్ష్యంతో అందరి సహకారంతోనే ఈరోజు కళాశాల నిర్మాణం ప్రభుత్వ నిమిత్తం లేకుండా సొంతంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు.

**అభివృద్ధి విమర్శలను స్వాగతిస్తా.. :** నియోజకవర్గ అభివృద్ధి విషయంలో విమర్శలను తాను స్వాగతిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో ప్రచార సాధనాలైన మీడియా ఎల్లప్పుడూ వాస్తవాలను ప్రతిబింబించాలని సూచించారు. అన్ని సమస్యలను వెలికి తీయాలని కోరారు. మీడియా నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులుగా నిలిచి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రాజకీయాలను ప్రజలను చైతన్యవంతులను చేసే సాధనాలు మీడియా అని మీడియా గొప్పతనం విలువ తనకు ఎంతో నచ్చుతుందని మీడియాకు తను మొట్టమొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో మీడియా కార్యాలముగ్గులై ఉండాలని పిలుపునిచ్చారు. మొగిలిగిద్ద ముఖ్యమంత్రి పర్యటన కోసం ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. మొగలిగిద్దకు ముఖ్యమంత్రి రాకతో ఆ గ్రామ రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని ఈ సందర్భంగా మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు గౌడ్, జంగ నరసింహ యాదవ్, రాజు, గూడ వీరేశం, హరినాథ్ రెడ్డి, మొగలిగిద్ద గ్రామ పెద్దలు అనుమారి వెంకటయ్య, శ్యాంసుందర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, సీనియర్ నాయకులు రఘునాయక్, ఖాదర్ గోరి, దళిత నాయకులు జాంగారి రవి, నల్లమోని శ్రీధర్, సీతారాం, ప్రకాష్, సుకియ నాయక్, అంబటి రాజు తదితరులు పాల్గొన్నారు.. %ఖూ

## హుస్సేన్‌సాగర్ ప్రమాద ఘటనలో ఒకరి మృతి
## గల్లంతైన యువకుడి కోసం విస్తృతంగా గాలింపు

హైదరాబాద్,జనవరి29: హుస్సేన్‌సాగర్ అగ్నిప్రమాద ఘటనలో ఒకరు మృతి చెందారు. రెండు రోజుల క్రితం భారతమాతకు హారతి కార్యక్రమంలో అగ్నిప్రమాదం జరుగగా బోటు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గణపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే 80 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ గణపతి మంగళవారం మృతిచెందాడు. మృతుడు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అలాగే బోటు ప్రమాదం సమయంలో గల్లంతైన యువకుడు అజయ్ కోసం గాలింపు కొనసాగుతోంది. రెండో రోజు హుస్సేన్‌సాగర్‌లో రెస్క్యూ బృందాలు గాలిస్తున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న భారత మాతకు మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. అదే సమయంలో హుస్న్లేసాగర్‌లో రెండు బోట్లు ఉంచి బోట్లలో నుంచి టపాసులు పేల్చాలని నిర్వాహకులు ప్లాన్ చేశారు. అయితే టపాసులు పేలుస్తున్న సమయంలో అపశృతి చోటు చేసుకుంది. టపాసులు దిశ మార్చుకుని నిల్వ ఉంచిన టపాసులపై పడటంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో అవి పేలాయి. దీంతో రెండు బోట్లు దగ్ధమయ్యాయి. అదే సమయంలో బోట్లో ఉన్న వారంతా తమ ప్రాణాలను రక్షించుకోడానికి కిందకు దూకారు. అయితే టపాసులు పెద్ద ఎత్తున పేలడంతో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సమయంలో బోట్లలోనే ఉన్న గణపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గణపతి క్రాకర్స్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. క్రాకర్స్ పేలుస్తున్న సమయంలోనే ప్రమాదం జరగడంతో గణపతికి 80 శాతం వరకు కాలిన గాయాలయ్యాయి. వెంటనే యశోదా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గణపతి మరణించాడు. ఇదే ప్రమాదంలో బోటు ఆపరేట్ చేస్తున్న మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అయితే ఈ బోటులో అజయ్ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు స్నేహితులు ఉన్నారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ప్రాణాలను దక్కించుకునేందకు అజయ్‌తో పాటు ఇద్దరు స్నేహితులు హుస్సేన్ సాగర్‌లో దూకారు. అయితే ఇద్దరు స్నేహితులు క్షేమంగా బయటకు రాగా.. అజయ్ మాత్రం గల్లంతయ్యాడు. రెండు రోజులుగా అజయ్ కోసం రెస్క్యూ టీం గాలింపు చర్యలు కొనసాగిస్తోంది. అజయ్ కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసే వరకు కూడా అతడు అదృశ్యమైనట్లు ఎవరూ గుర్తించలేదు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు అజయ్ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగించారు. తిరిగి ఈరోజు తెల్లవారుజాము నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రాణాలను కాపాడుకునే సమయంలో నీళ్లలో దూకిన వీరంతా లైఫ్ జాకెట్లు ధరించలేదని తెలుస్తోంది. అజయ్ ఆచూకి కనుగోనాలంటూ తల్లిదండ్రులు హుస్సేన్‌సాగర్ ఒడ్డునే కూర్చుని రోదిస్తున్న తీరు అందరినీ కంటతడిపెట్టిస్తోంది.

## మైనర్ బాలికలపై నలుగురు యువకులు అత్యాచారం

హైదరాబాద్,జనవరి29:14 ఏళ్ల మైనర్ లంబాడా అమ్మాయిపై నలుగురు యువకులు అత్యాచారం చేశారు. ఈ ఘటన రెండు సంవత్సరాల క్రితం చత్రినాక వద్ద చోటు చేసుకుంది. నిందితులు, అమ్మాయిని మాయమాటలు చెప్పి ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు మద్యం తాగించేందుకు యత్నించారు. ఆమె నిరాకరించగా, నిందితులు ఆమెను లైంగికంగా వేధించారు. ఒకరు ఆమె పొట్టపై తన్నడంతో, ఆమె అచేతనంగా పడిపోయింది. కొన్ని గంటల తర్వాత, ఆమె స్పృహ లోకి వచ్చింది. తన బట్టలు చిరిగిపోయి ఉన్నాయని, శరీరంలో నొప్పిగా అనిపించిందని తెలిపింది. ఆపై, అక్కడి నుంచి బయటకు వచ్చి పరుగెత్తి.. తల్లిదండ్రులకు జరిగిన విషయం వివరించింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై సామూహిక అత్యాచారం, లైంగిక వేధింపు కేసు నమోదైంది. న్యాయ విచారణలో నిందితులు అమ్మాయిని వివాహం చేసుకోవాలని కోరారు. అయితే ఆమె న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించింది. మేజిస్ట్రేట్ సమక్షంలో నిర్వహించిన ఐడెంటిఫికేషన్ పరేడ్‌లో, బాలిక నిందితులను స్పష్టంగా గుర్తించింది. కోర్టులో పలుమార్లు నిందితుల తరపు న్యాయవాదులు క్రాస్ ఎక్జామినేషన్ చేసినా బాలిక ధైర్యంగా నిలబడిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. కోర్టు బాలికకు రూ.7 లక్షల పరిహారం మంజూరు చేసింది. అయితే, బాలికను ఈ ప్రమాదంలోకి లాగిన స్నేహితురాలు ఇంకా జువెనైల్ న్యాయ మండలిలో విచారణ ఎదుర్కొంటోంది. ఘటన జరిగిన సమయంలో బాధితురాలు మైనర్ గా ఉన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులకు కోర్టు కఠినమైన శిక్ష విధించింది. ఇద్దరు నిందితులకు 25 సంవత్సరాల శిక్ష విధించగా, మరో ఇద్దరికి 5 సంవత్సరాల శిక్ష విధించింది. ఘటన అనంతరం బాధిత బాలికను వివాహం చేసుకునేందుకు నిందితులు సిద్ధ పడ్డారు. కానీ బాలిక న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించి నిందితులకు శిక్ష పడేలా పోరాటం చేసిందని పోలీసులు తెలిపారు.

## బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచిన తరువాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి : ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్,జనవరి29:స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపీటీస్, జడ్పీటీసీ లలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజ కీయంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. విద్య, ఉ ద్యోగ రంగాలలో కూడా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క దానికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్‌బీ వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ వికృత పోకడలు



అందరిదీ ఒక దారి అయితే ఉలిపి కట్టెదొక దారి అన్నట్టుగా ఉంది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీరు. రెండవ సారి అధ్యక్ష పీఠాన్నధిష్టించిన ట్రంప్ మొదటి వారం రోజుల్లోనే పచ్చిగా తన మితవాద అజెండాను ముందుకు తెచ్చారు. అందులో ముఖ్యమైనది వలసదారులను దేశం నుంచి అవమానకరమైన రీతిలో పంపించేయడం. ఇంతకాలం అమెరికా ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు కల్పించడంలో కీలకంగా వ్యవహరించిన వలసదారులను వెలివేయాలని చూడడం తెలివితక్కువతనం అనుకోవాలా? మూర?త్వం అనుకోవాలా? అతి తక్కువ జీతాలతో రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేసిన వలసదారులను దేశం పైకి దండెత్తిన ఆక్రమణ దారులుగా చిత్రించడం ట్రంప్‌కే చెల్లింది. బ్రెజిల్‌కు చెందిన 88 మంది వలసదారులను చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు వేసి పంపిన తీరుపై ప్రపంచవ్యాపితంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బాత్‌రూమ్‌కు సైతం వెళ్లే పరిస్థితి లేకుండా%ౖ% మంచినీళ్లు సైతం ఇవ్వకుండా%ౖ% ఎసి నిలిపివేసి వలసదారులను ఉగ్రవాదులు, నేరస్తుల్లా ట్రీట్ చేయడం అత్యంత గర్హనీయం. రెడ్ ఇండియన్లను తరిమేసి యూరప్ తదితర దేశాలకు చెందిన శ్వేత జాతీయులు అక్కడ పాగా వేశారు. ఆఫ్రికన్ దేశాల నుంచి బానిసలను తీసుకొచ్చి వారితో వెట్టి చాకిరీ చేయించుకున్న చరిత్ర అమెరికాది. దాదాపు 35 కోట్ల యుఎస్ఎ జనాభాలో మూడు కోట్ల మంది వరకూ వలసదారులే. ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ తాత ఫ్రెడరిక్ ట్రంప్ కూడా బవేరియా, జర్మనీ మూలాలుండి వలస వచ్చిన వాడే. విద్వేష విషం చిమ్మే మితవాదమే అజెండాగా కలిగిన రిపబికన్ పార్టీ తరపున ఎన్నికైన ట్రంప్.. మహా కుబేర సామ్రాజాన్ని సృష్టించేం దుకు వలసదారుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారు.. అధికా రంలోకి వచ్చిన వెంటనే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వుల పట్ల అమెరికా లోపల, వెలుపల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 1868లో14వరాజ్యాంగ సవరణ ద్వారా అమలులోకి వచ్చిన చట్టం ప్రకారం.. అమెరికాలో జన్మించిన వారికి జన్మతహ పౌరసత్వం లభిస్తుంది. ఈ చట్టాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమంటూ సియాటెల్, వాషింగ్టన్ కోర్టులు ఇప్పటికే నిలిపివేశా యి. 22 రాష్ట్రాలు, 200కిపైగా కార్మిక సంఘా లు ఈఉత్తర్వులను సవాల్ చేస్తూ కోర్టులను ఆశ్రయించాయి. ట్రంప్ ఆదేశాలు అమలు కావాలంటే.. ఇవన్నీ తేలి సుప్రీంకోర్టు కూడా ఆమోదించాల్సి ఉంటుంది. ఇదంతా అయ్యేది కాదని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. వలసదారులను తీవ్ర అభద్రతకు గురిచేసి, తద్వారా మరింత కారుచౌకగావారి శ్రమనుకార్పొరేట్‌సంస్థలు దోచు కోవడంఅంతర్లీనంగా ఉన్నపన్నాగం. అక్కడికార్మిక,ఉద్యోగ సంఘాలు సైతం ట్రంప్ తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఈ పరిణా మాలతో తెలుగు వారు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్యూ రీసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం 2024 నాటికి ఏడు లక్షల 25 వేల మంది భారతీయులు అమెరికాలో ఉన్నారు. వారిలో 20 వేల మందికి పైగా సరైన పత్రాలు లేకుండా ఉ ంటున్నారని అంచనా. మైడియర్ ఫ్రెండ్ అంటూ ప్రధాని మోడీ ట్రంప్‌ను అభినందించారు. తాజాగా ఆయనతో ఫోన్‌లో కూడా సంభాషించారు. ఈ సంభాషణలో అమెరికా నుంచి పంపడానికి సిద్ధంగా ఉన్న వేలాది మంది భారతీయ వలసదారులకు సంబంధించిన ఊసే లేదు. పైగా చైనా, భారత్, బ్రెజిల్ తదితర దేశాలు అధికంగా సుంకాలు విధిస్తున్నాయంటూ ట్రంప్ రుసరుసలాడుతున్నాడు. అమెరికాకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న అపర కుబేరులుసహా అమెరికన్లందరిపై విధించే ఆస్తి పన్నును రద్దు చేసి, ఆ లోటును ప్రపంచ దేశాలపై సుంకాలు అధికంగా వసూలు చేయడం ద్వారా భర్తీ చేస్తామని తెంపరి ట్రంప్ బహిరంగంగానే ప్రకటించాడు. మితవాద అజెండా కలిగిన బిజెపి నేతృత్వంలోని మోడీ సర్కారు ట్రంప్ గత పాలనలో అంటకాగినా%ౖ% ఇండియాకు ఒరిగిందేమీ లేదు. అడపా దడపా భారత్‌పై ఆంక్షల కొరడా ఝుళిపిస్తూనే ఉంది. హెచ్ 1 బి సహా వీసాలను కఠినతరం చేసింది. .అమెరికా ఇండో పసిఫిక్ వ్యూహంలో భాగమైన క్వాడ్ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న భారత్ ఈ ఏడాది చివరిలో సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. అమెరికా ప్రయోజనాలే ఫస్ట్ అని ట్రంప్ ప్రకటించిన తరువాత కూడా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమెరికాతో అంటకాగేందుకే ఇష్టపడుతోంది. ఇది మన దేశ ప్రయోజనాలకు ఎంతమాత్రం మంచిది కాదు. అమెరికా ప్రపంచ పోలీస్ పెత్తనాన్ని సహించేది లేదని మెక్సికో, కెనడా, బ్రెజిల్ ఇప్పటికే స్పష్టం చేశాయి. మదర్ ఆఫ్ డెమొక్రసీ అని లెక్చర్లిచ్చే మోడీ ప్రభుత్వం అమెరికా పట్ల లొంగుబాటు వైఖరిని విడనాడి స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించాలి. వలసదారుల విషయంలో అంతర్జాతీయ చట్టాలు, న్యాయ నియమాలను అమెరికా గౌరవించేలా ఒత్తిడి తీసుకురావాలి.

## 2రాజోలు లో చోరీ

రాజోలు: తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ జరిగిన సంఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజోలు పట్టణంలోని సత్తిరాజు వారి వీధిలో ఉంటున్న రిటైర్డ్ మాస్టర్ గెల్లి బాపన్న గుప్తా ఈనెల 20న కుటుంబ సభ్యులతో కలిసి ఓం శాంతి దైవ కార్యక్రమంలో పాల్గొనేందుకు అన్నవరం వెళ్లారు. పనిమనిషి పగిలి ఉన్న తాళాన్ని గమనించి స్థానికులకు తెలియజేయడంతో కుటుంబీకులకు సమాచారం అందించారు. బాధితులు ఇంటికి వచ్చి పోలీసులకు తెలియజేసి చూడగా రెండు బెడ్ రూమ్లు తెరచి బీరువాలలో ఉన్న బట్టలు లాగేసి బంగారు, వెండి, విలువైన వస్తువులను దొంగిలించినట్లు గుర్తించారు. బీరువాలో దాచిన సుమారు 40 కాసులు బంగారపు వస్తువులు, ఐదు కేజీల వెండి నగలు చోరీకి గురయ్యాయని గుప్తా కుటుంబ సభ్యులు పోలీసులకు వివరాలు అందించారు. చోరీకి గురైన ఇంటిని రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై బి. రాజేష్ కుమార్ పరిశీలించారు. క్లూస్ టీం, జిల్లా క్రైమ్ టీం రంగంలోకి దిగి దొంగతనం జరిగిన తీరును పరిశీలన చేసి వివరాలు సేకరిస్తున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్ల వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ఊళ్లకు వెళ్ళినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేయమని ఎంత అప్రమత్తం చేసిన ప్రజలు నిర్లక్ష్యంగానే ఉంటున్నారని పోలీసులు అంటున్నారు..

## అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు
## ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సంగారెడ్డి జిల్లా,జనవరి29:హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకుపుట్టేలా చేస్తోంది హైడ్రా. తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహరీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చివేతల తరువాత కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్‌కు కబ్జా దారులు వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లును హైడ్రా కూల్చివేసింది. ఇళ్లు నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా... అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని.. చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## లాభదాయక ఆయిల్ పామ్ పంటను రైతులు సాగు చేయాలి..

**- రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో ఆయిల్ పామ్ పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, ప్రజాక్రాంతి జనవరి 29: ఖమ్మం జిల్లాలో లాభదాయక ఆయిల్ పామ్ పంటను అధిక సంఖ్యలో రైతులు సాగు చేయాలని, ఆ దిశగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో ఆలస్యం రామారావు పండిస్తున్న ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు.ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్న రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. గతంలో ఏ పంటలు సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో పంట వేశారు, అంతర్ పంటల సాగు ఎలాఉంది, ఆయిల్ పామ్ పంట సంవత్సరానికి ఎంత దిగుబడి వస్తుంది, నీటి వనరులు ఎలా ఉన్నాయి వంటి వివిధ అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట వేసేందుకు ప్రభుత్వం మొక్కల సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయ కల్పనకు సబ్సిడీ, మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర్ పంట పెట్టుబడులకు కొంత సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులు బాగు పడతారని, 4 సంవత్సరాల నుంచి ఆయిల్ పామ్ పంట వల్ల ఆదాయం రావడం ప్రారంభమవుతుందని, 7వ సంవత్సరంనుంచి పూర్తిస్థాయి పంటవస్తుందని,రైతులకు అద్భుతంగా ఆదాయం లభిస్తుందని, పరిసరాలలోని ఇతర రైతులు కూడా ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని చెరువులవద్ద శిఖం భూములుఆక్రమణలకు గురయ్యా యని రైతులు ఫిర్యాదు చేయగా, విచారణ చేసి చర్యలు తీసుకుం టానని కలెక్టర్ తెలిపారు. చెరువుల కబ్జా, ఆక్రమణలపై విచారణ చేసి ఫిబ్రవరి 15 లోపు నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్, రెవెన్యూ ఇన్స్ పెక్టర్ లను ఆదేశించారు. పామ్ ఆయిల్ పంట కోత యంత్రాలు సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ద్వారా ఆయిల్ పామ్ పంట వెయ్యి ఎకరాలలో క్లస్టర్ ఉంటే రైతులకు లాభం అయ్యే విధంగా లేబర్ సరఫరా చర్యలు చేపడతామని అన్నారు. గ్రామంలో అర ఎకరం వరకు లీజ్ కు ఇస్తామని నెల రోజుల వ్యవధిలో క్లస్టర్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి అత్యాధునిక వ్యవసాయ పరికరాలు రైతులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు సరఫరా చేసే ప్రతి ఆయిల్ పామ్ మొక్కకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలు వివరాలు తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాదా బైనామా దరఖాస్తులకు ప్రభుత్వం నుంచి వచ్చే పరిష్కారం మేరకు జిల్లాలో చర్యలు చేపడతామని అన్నారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఉద్యానవన శాఖ అధికారి జి నగేష్, రఘునాథపాలెం మండల తహసీల్దార్ విల్సన్, గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్ మేనేజర్ ఏ. రామకృష్ణ, టి.ఎస్.ఎం.ఐ.పీ నాగమణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఏపీలో మరో 12 అనాధ వృద్ధాశ్రమాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



అమరావతి : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏపీలోని వృద్ధులకు తీపికబురును అందించింది. తోడులేని అనాధ వృద్ధులకు అండగా నిలిచేందుకు ఏపీలో కొత్తగా 12 వృద్ధాశ్రమాలను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం వీటిని ఆయా చోట్ల నెలకొల్పేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. %కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 32 వృద్ధాశ్రమాలు కేటాయిస్తే ఆంధ్రప్రదేశ్‌కు 12 మంజూరు చేసింది. తిరుపతి జిల్లాలో 4, వైఎస్సార్ జిల్లాలో 2, పార్వతీపురం, అనకాపల్లి , కాకినాడ, శ్రీసత్యసాయి, పల్నాడు , మన్యం, ఎన్టీఆర్ జిల్లాలకు ఒక్కోటి చొప్పున మంజూరు చేసింది. ఒక్కో ఆశ్రమానికి కేంద్రం 25 లక్షలు మంజూరు చేసింది.ఆశ్రమంలో కనీసం 25 మంది ఉంటే కేంద్రం ప్రతి సంవత్సరం రూ.21 లక్షలు మంజూరు చేస్తుంది. వీటిని స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించనున్నాయి. కేంద్రం ఆర్థిక సాయంతో రాష్ట్రంలో 68 వృద్ధాశ్రమాలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మచిలీపట్నం, చిత్తూరు మాత్రమే నడుస్తున్నాయి. వీటితో పాటు మరో వంద వరకు ప్రైవేట్ నిర్వహణలో పనిచేస్తున్నాయి.

# ఉపాధ్యాయుడుకి దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు



హైదరాబాద్ : విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి ఆదర్శంగా నిలువాల్సిన ఉపాధ్యాయుడు సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడుకి తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్‌జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేశారు. ఆగ్రహించిన తల్లిదండ్రులు స్కూల్‌కు చేరుకొని సదరు టీచర్‌కు దేహశుద్ధి చేశారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఏపీ ప్రభుత్వం సీరియస్.

**పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఏపీ ప్రభుత్వం సీరియస్.. విచారణకు పవన్ కల్యాణ్ ఆదేశాలు**

మాజీ మంత్రి, వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల కబ్జా వ్యవహారాన్ని ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. భూ ఆక్రమణలపై విచారణకు ఏపీ డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.%చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం మంగళంపేట రెవెన్యూ గ్రామ పరిధిలోని 75 ఎకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిందని కొద్దిరోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులతో పవన్ కల్యాణ్ బుధవారం నాడు సమావేశమయ్యారు. అటవీ భూముల ఆక్రమణలు, అడవుల ధ్వంసంపై విచారణకు పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని పీసీసీఎఫ్‌కు సూచించారు.ఇదిలా ఉంటే.. పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు నివేదికలను సిద్ధం చేశారు. 75 ఎకరాల అటవీ భూములను అక్రమంగా పెద్దిరెడ్డి కుటుంబం పరిధిలో చేర్చడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రాథమిక నివేదికను అందజేశారు. పుంగనూరు, తంబళ్లపల్లి, రేణిగుంట మండలాల్లో రికార్డులు తారుమారు చేసి బినామీ పేర్లతో వందల ఎకరాలను ఆక్రమించినట్లుగా ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటన్నింటిపై రెవెన్యూ శాఖ అధికారులతో కాసేపట్లో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. పెద్దిరెడ్డి భూమాఫియాపై తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.



# అమృత స్నానానికి సాధువులు, అకాడాలు.



ప్రయాగ్‌రాజ్: త్రివేణి సంగమం వద్ద ఇవాళ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరికొన్ని గంటల్లో సాధువులు, అకాడాలు, సన్యాసులు.. అమృత స్నానం ఆచరించేందుకు సంగమం వద్దకు రానున్నారు. దీంతో అక్కడ భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. మౌనీ అమావాస్య సందర్భంగా సాధువులు ఇవాళ రెండోసారి పుణ్య స్నానాలు చేయాల్సి ఉంది. అయితే తెల్లవారుజామున తొక్కిసలాట ఘటన జరిగిన నేపథ్యంలో.. అకాడాలు అమృత స్నానాన్ని రద్దు చేశారు. ఉదయం పది గంటల తర్వాత పవిత్ర స్నానం ఆచరించేందుకు సిద్ధం అయ్యారు. రద్దీ తగ్గిన తర్వాత వాళ్లు రానున్నారు. మహాకుంభ్ డీఐజీ వైభవ్ కృష్ణ మాట్లాడుతూ.. ఇవాళ 10 కోట్ల మంది పుణ్య స్నానం ఆచరించే అవకాశం ఉందన్నారు. నిన్న సాయంత్రం నుంచే అధికారులు, సిబ్బంది విధుల్లో ఉన్నట్లు చెప్పారు. ప్రజలు శాంతియుతంగానే అన్ని ఘాట్లలో స్నానాలు చేస్తున్నట్లు చెప్పారు. తెల్లవారుజామున భారీ సంఖ్యలో జనం ఎగబడినట్లు చెప్పారు. జనాన్ని అదుపు చేస్తేనే, తాము స్నానానికి వస్తామని అకాడాలు చెప్పాయన్నారు. అకాడా మార్గం, అకాడా ఘాటు రెడీగా ఉన్నట్లు చెప్పారు.

# తిరుమలలో టోకెన్లు ఉన్న భక్తులకు నేరుగా దర్శనం



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టోకెన్లు ఉన్న భక్తులకు నేరుగా స్వామివారి దర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని వివరించారు. నిన్న స్వామివారిని 70,610 మంది భక్తులు దర్శించుకోగా 17,310 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల స్వామివారికి రూ. 3.78 కోట్లు ఆదాయం వచ్చిందని అన్నారు.గోవిందరాజస్వామివారి ఆలయంలో ప్రారంభమైన అధ్యయనోత్సవాలు తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయంలో మంగళవారం రాత్రి అధ్యయనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 20వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు జరుగనున్నాయని అర్చకులు తెలిపారు. మాఘ మాసంలో ఆలయంలో దివ్యప్రబంధాన్ని పారాయణం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.ఇందులో భాగంగా ప్రతిరోజూ రాత్రి 7.15 గంటలకు ఆలయంలోని కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారిని, సేనాధిపతివారిని, ఆళ్వార్లను తీసుకొచ్చి దివ్యప్రబంధాన్ని పారాయణం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణా రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# స్తంభించిన హైదరాబాద్ మెట్రో సేవలు.. ప్రయాణికుల ఇబ్బందులు



హైదరాబాద్‌లో మెట్రో సేవలు స్తంభించాయి. సాంకేతిక కారణాలతో నాగోలు-రాయదుర్గం రూట్‌లోని మెట్రో సేవలు దాదాపు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ, నాగోలు నుంచి సికింద్రాబాద్, మియాపూర్ నుంచి అమీర్‌పేట మధ్య మెట్రో రైళ్లు ఆగిపోయాయి. ప్రస్తుతం నాగోలుకు బదులుగా తార్నాక నుంచే మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. సాంకేతిక కారణాలతో ఆయా మార్గాల్లో మెట్రో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. పూర్తిస్థాయిలో మెట్రో రైళ్ల పునరుద్ధరణకు మరో గంట సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, ఉదయం సమయం కావడంతో ఆఫీసులకు వెళ్లే ప్రయాణికులతో మెట్రో స్టేషన్లు రద్దీగా ఉన్నాయి. ఇదే సమయంలో మెట్రో రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

# బూతులు తిడుతూ లైన్‌మెన్‌పై దాడి



హైదరాబాద్ : కరెంట్ బిల్లు చెల్లించాలని అడిగినందుకు లైన్‌మెన్‌పై ఓ వ్యక్తి నానా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కరెంట్ బిల్లు అడిగినందుకు సురేష్ అనే లైన్‌మెన్‌పై ఇర్ఫాన్ అనే వ్యక్తి బూతులు తిడుతూ, సురేష్ బైక్‌ను ధ్వంసం చేశాడు. మర్యాదగా మట్లాడాలని లైన్‌మెన్ సూచించినా ఇర్ఫాన్ వినకుండా రుబాబుగా మాట్లాడుతూ దాడికి పాల్పడ్డాడు. విద్యుత్ అధికారుల ఫిర్యాదుతో మల్కాజ్‌గిరి పోలీసులు ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, లైన్‌మెన్‌పై దాడి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మరో 5 ఏళ్లలో 100 ప్రయోగాలు?




శ్రీహరికోట: జీఎస్ఎల్వీ ఎఫ్-15 రాకెట్ ద్వారా ఇవాళ ఇస్రో నావిగేషన్ శాటిలైట్‌ను నింగిలోకి పంపింది. దీంతో వందో ప్రయోగ మైలురాయిని ఇస్రో అందుకున్నది. వంద రాకెట్ ప్రయోగాలను చేపట్టేందుకు ఇస్రోకు 46 ఏళ్లు పట్టింది. అయితే డబుల్ సెంచరీ మాత్రం మరో అయిదేళ్లలోనే పూర్తి కానున్నట్లు ఇస్రో పేర్కొన్నది. రానున్న అయిదేళ్లలో మరో 100 ప్రయోగాలు చేపట్టేందుకు ఇస్రో సిద్ధంగా ఉన్నట్లు చైర్మెన్ వీ నారాయణన్(%ఎ ఛీుతీుఝఖుఅ%) తెలిపారు. జీఎస్ఎల్వీ ఎఫ్-15 ఎన్వీఎస్-02 నావిగేషన్ శాటిలైట్ ప్రయోగంతో.. వంద మిషన్ల మైలురాయిని ఇస్రో చేరుకున్నది. ఈ నేపథ్యంలో ఇస్రో చైర్మెన్ మాట్లాడుతూ.. మరో అయిదేళ్లలో 200 మార్క్‌ను అందుకోనున్నట్లు ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాబోయే అయిదేళ్లలో వంద ప్రయోగాలు చేపట్టవచ్చా అని వేసిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. మీరు సరైన ప్రశ్నే అడిగారని, అది సాధ్యమే అని ఇస్రో చైర్మెన్ వీ నారాయణన్ తెలిపారు. %గడిచిన 46 ఏళ్లలో.. 548 శాటిలైట్లను కక్ష్యలోకి పంపింది ఇస్రో. దీనితో పాటు 120 టన్నుల పేలోడ్ పంపించింది. దీంట్లో 433 విదేశీ శాటిలైట్లకు చెందిన 23 టన్నుల పేలోడ్ కూడా ఉన్నట్లు ఇస్రో చీఫ్ తెలిపారు. నాసాతో సాగుతున్న సహకారంపై ఆయన మాట్లాడుతూ.. త్వరలో నిసార్ మిషన్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎన్జీఎల్వీ ప్రాజెక్టు కూడా ఉన్నట్లు ఆయన చెప్పారు. సింథటిక్ అపర్చర్ రేడార్ శాటిలైట్ మిషన్ ప్రయోగంలో రెండు రేడార్లు ఉంటాయి. ఎల్ బ్యాండ్ రేడార్‌ను ఇస్రో, ఎస్ బ్యాండ్ రేడాను నాసా జేపీఎల్ అభివృద్ధి చేయనున్నాయి. బెంగుళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో దీన్ని డెవలప్ చేస్తున్నారు.ప్రస్తుతం భారత్‌కు నాలుగు రకాల నావిగేషన్ శాటిలైట్లు అందుబాటులో ఉన్నాయని, ఇవాళ జరిగిన ప్రయోగం అయిదోది అని, మరో మూడింటికి ఆమోదం వచ్చిందన్నారు. మరో అయిదారు నెలల్లో నావిగేషన్ శాటిలైట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మెన్ నారాయణన్ తెలిపారు. తమిళనాడులోని కులశేఖరపట్టణం నుంచి చేపట్టబోయే రాకెట్ ప్రయోగాల గురించి మాట్లాడుతూ.. అక్కడ బిల్డింగ్ నిర్మాణాలు పూర్తి కావడానికి మరో రెండేళ్లు పడుతుందన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన తర్వాత అక్కడి నుంచి కూడా ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ వెల్లడించారు.నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహి కిల్(ఎన్జీఎల్వీ)ను ప్రయోగించేందుకు నిర్మాణం చేపట్టాలని కేంద్రం నుంచి ఇస్రోకు అనుమతులు వచ్చినట్లు నారాయణన్ తెలిపారు. ఎన్జీఎల్వీ రాకెట్లు భూ కక్ష్యలోకి 20 టన్నుల పేలోడ్ మోసుకెళ్లగలవు. జియోస్టేషనరీ ఆర్బిట్‌లోకి 10 టన్నుల బరువు మోసుకెళ్తాయి. ఇలాంటి రాకెట్లకు ఎక్కువ డిమాండ్ ఉన్నట్లు చెప్పారు. ఎన్జీఎల్వీ రాకెట్లను శ్రీహరికోటలో నిర్మిస్తున్న మూడవ లాంచ్ ప్యాండ్ నుంచి ప్రయోగించనున్నట్లు తెలిపారు. చంద్రయాన్ 4, 5 మిషన్ల కోసం ఎన్జీఎల్వీ రాకెట్లను వాడనున్నట్లు చెప్పారు. గగన్‌యాన్1 మిషన్ కోసం ప్రస్తుతం ప్రిపరేషన్ జోరుగా సాగుతున్నట్లు ఇస్రో చీఫ్ తెలిపారు.

# దొంగను పట్టుకొని చెట్టుకు కట్టేసిన స్థానికులు.



వేములవాడ : ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించిన దొంగను కాలనీ వాసులు చాకచక్యంగా పట్టుకొని చెట్టుకు కట్టేశారు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవడ పట్టణం గాంధీనగర్‌లో తెల్లవారుజామున దొంగతనానికి యత్నించిన నిందితుడిని పట్టుకొని కాలనీ వాసులు పోలీసులకు అప్పగించారు. చేతులకు గ్లౌజులు, ముఖంపై టవల్ వేసుకుని సీసీ కెమెరాకు చిక్కకుండా దొంగతనానికి ప్రయత్నించాడు. సీసీ కెమెరాల ద్వారా గమనించిన స్థానికులు దొంగను పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘుట స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సునీతా విలియమ్స్‌ను భూమికి తీసుకొచ్చేందుకు ...



వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుష్ విల్మోర్ వారం రోజుల మిషన్ కోసం వెళ్లి సాంకేతిక సమస్యల కారణంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అయితే, వారిని సురక్షితంగా తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు స్పేస్ ఎక్స్ అధినేత, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ )ను సాయం కోరారు.%అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు సహాయం చేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనను కోరినట్లు మస్క్ తాజాగా తెలిపారు. సాంకేతిక సమస్యల కారణంగా నెలలుగా ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయిన వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు గత బైడెన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదని విమర్శించారు. బైడెన్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వ్యోమగాములు నెలలుగా ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోవాల్సి వచ్చిందన్నారు. వారు అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఆ ఇద్దరు వ్యోమగాములను తిరిగి భూమికి తీసుకొచ్చేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నట్లు మస్క్ వెల్లడించారు. ఇందుకోసం ట్రంప్ స్పేస్‌ఎక్స్ సాయం కోరినట్లు చెప్పారు. అధ్యక్షుడి అభ్యర్థన మేరకు త్వరలో ఆ పని పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఎలాన్ మస్క్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు.భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, బుష్ విల్మోర్ గతేడాది జూన్‌లో బోయింగ్ స్టార్‌లైన్ స్పేస్‌షిప్‌లో ఐఎస్ఎస్‌కి వెళ్లారు. వారం రోజుల మిషన్ కోసం వెళ్లిన వ్యోమగాములు స్టార్‌లైర్‌లో సాంకేతిక లోపం కారణంగా అక్కడే చిక్కుకుపోయారు. జూన్ 6న ఇద్దరూ వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోకి వెళ్లగా.. అదే నెల 14న తిరిగి భూమిపైకి రావాలి. కానీ, స్టార్ లైనర్‌లో హీలియం లీకేజీ నేపథ్యంలో ప్రయాణం వాయిదా పడింది. ఇద్దరు వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకువచ్చేందుకు నాసా ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం స్పేస్ ఎక్స్ తో కలిసి పనిచేస్తోంది. ఫిబ్రవరి 2025లో తిరిగి భూమికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. అయితే. ఆ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో వాళ్లు మరోనెల రోజుల పాటు ఇంటర్‌నేషనల్ స్పేస్ స్టేషన్‌లోనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది. మార్చి లేదా ఏప్రిల్ తొలి వారంలో వారు తిరిగి భూమిపైకి చేరుకునే అవకాశాలున్నాయి

# మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్ : ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 15 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన కలిచి వేసిందని హరీశ్‌రావు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రధాని నరేంద్ర మోదీకి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. మౌని అమావాస్య సందర్భంగా అమృత స్నానంలో పాల్గొనేందుకు లక్షల సంఖ్యలో భక్తులు త్రివేణి సంగమంకు చేరుకున్నారు. అయితే ఇవాళ తెల్లవారుజామున 3 గంటల సమయంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 15 మంది మృతిచెందారు. మరో 50 మందికిపైగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూపరాణి ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. అక్కడ పోస్టు మార్టం నిర్వహించనున్నారు.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com